
# చీమ

## పి. సత్యవతి



వందనకి తనమీద తనకి ఎక్కడలేని సానుభూతి ముంచుకొస్తోంది. ఏమిటీ వెధవ బ్రతుకు? దీనికసలు అర్థం వుందా! హోమ్ ఈజ్ టూ మచ్ విత్ వందన! ఎస్. హోమ్ ఈజ్ టూ మచ్ విత్ వందన! షి హేజ్ నో టైం టు స్టాండ్ అండ్ స్టేర్! ఎస్. హోమ్ ఈజ్ టూ మచ్ విత్ వందన!

ఫిర్ సుబహ్ హోగయీ!

లేస్తూనే జుత్తుకి రబ్బర్ బ్యాండ్ కట్టి, కొంగు నడుముకి బిగించి—కాఫీ డికాక్షన్ తీసి, పాలు మరిగించి—టిఫిన్ తయా రించి, భోజనం ఏర్పాట్లు పూర్తి గావించి—ఒకటే మిటీ శతావధానం—అవునూ—ఏడు గంటలైనా వరాలు రాలేదు—అయ్యో! వరాలు రాలేదు—అ య్యయ్యో వరాలు రాలేదు—వరాలు రాలేదండీ బాబూ వరాలు రాలేదు—ఎలాగిప్పుడు? ముంచు కొచ్చిన సానుభూతి మున్నేటి వరదైంది. ఏమిటో ఈ బ్రతుకు! గానుగెద్దు నయం, ఈ వందన ఎద్దుకంటె!

హడావుడికి పట్టకారు పట్టుకోకుండా గిన్నె దించితే చెయ్యి కాలిందీ, పాలూ పొంగిపోయాయి—క్రయ్ ఓవర్ స్పిల్ట్ మిల్క్‌కి తీరిక లేదా—

"ఏవిమిటైనా నన్ను లేపవేం—నేను ఆఫీసుకి వెళ్ళక్కర్లేదా?" పతి దేవుని సుప్రభాత పలు గుడ . సారీ సార్—మర్చిపోయాను—మీ అంతట మీ  లేస్తారనుకున్నాను. అవును మీరు నిజంగా .ంచివారే—మా అక్క మొగుళ్ళా కాకుండా మీ బ్రష్షు మీద మీరే పేస్ట్ వేసుకుని, మీ పళ్ళు మీరే తోముకుంటారు—వెధవ పళ్ళు ఈ మధ్య సరిగ్గా తోముకోక—టైం చాలక—నెప్పులె డుతున్నాయి—నా వండ్ బాబూ మీవి కావు—మీ పళ్ళకేం—తాంబూలంతో సిగరెట్ పొగతో చక్కగా గారబట్టి బావున్నాయి. ఇదుగో తెస్తున్నా—పొగలు కక్కే వేడి వేడి ఫిల్టర్ కాఫీ—

నా మొహంలా వుందా—నా మొహం అంత బాగుందన్నమాట—పెళ్ళి కాక ముందు మాట—మరే! ఇప్పుడు కాస్త పంచదార తగలెయ్యనా? తగలేసేటంత పంచదారే వుంటే ఇకనేం—కాస్త కాఫీలో వేస్తానులే—వరాలు రాలేదు స్వామీ—చస్తు న్నాను—నా మొహం కడుక్కుని బొట్టు పెట్టుకోక పోయినా ఫరవాలేదుగానీ వాకిలి కడిగి ముగ్గెయ్య కపోతే ఇంటి రాక్షసి వూరుకోదు—చంపేస్తుంది. వరాలుకి బుద్ధిలేదు—జీతం పెంచినా—పాత చీరె లిచ్చినా నాగాలు పెడుతోంది—సాయంత్రం రానీ చెబుతాను.

ఏమిటీ సాక్స్ ఉతికించాలా? వరాలు రాలేదని చెబుతుంటే వినపడలేదా? మీకేకాదు నాకూ వుంది ఆఫీసు—ఈ ఉతుకుళ్ళు పెట్టుకుంటే ఆఫీసులో మెమోలు అందుకోవాలి—ఆడవాళ్ళు లేటుగా వెడితే అందరికీ ఎగతాళే!

సరేలెండి ఓ వారం రోజులు సెలవు పడేసి మీ సాక్సులన్నీ పుతికేసి, మీ షర్టులన్నింటికీ గుండీలు కుట్టి, మీ బూట్ల జతలన్నింటికీ పాలిష్ చేసేసి—ఇంకా ఏమేం వున్నాయో అవన్నీ చేసేస్తాను—దానికేంగానీ—ఓ పది నిమిషాలు ఆగితే నన్ను బస్ స్టాపులో దింపవచ్చుగా! అసలే వరాలు రాలేదు—నేను పది నిమిషాల్లో తెములడం మీరింత వరకూ చూడలేదా! అవును మరి మీరలా చూస్తూ

నిలబడండి—ఇంటికి తాళాలు పెట్టడం—సాయంత్రానికి పెరుగు తోడెయ్యడం—ప్రక్క వాళ్ళకి తాళం చెవులు ఇవ్వడం—ఈ పన్లు అన్నీ నావే కదా! వెళ్ళండి సార్ వెళ్ళండి—ఆటోలో వెళ్ళమంటారా? మరే—నా దగ్గరంత సొమ్ము లేదు గానీ—పక్కింట్లో నుంచి ఫోన్ చేసి ఓ అరగంట పర్మిషన్ అడిగి బస్సులో వెడతాను—మీరు మీ స్కూటర్ ఎక్కి ఎంచక్కా టైంకి వెళ్ళి—ప్రశంసలు పొందండి—అవును— వరాలు రాకపోతే మీకేం—మీ పన్లన్నీ జరిగిపోతాయి—నాకే కదా ఇబ్బంది—

ఈ వరాలు దయ్యం సాయంత్రం అయినా తగలడుతుందో లేదో! ఇది రాలేదని పిల్లలకి హోం వర్క్‌లు యివ్వకుండా వుంటారా! ఏ పనులు ఆగుతాయిగనుక—

"ఇవ్వాళ పనమ్మాయి రాలేదా?" అని అడగనే అడిగింది చందన మహారాణి.

పాలు కడిగిన ముత్యంలా, మంచుకి తడిసిన మల్లెపువ్వులా—ప్రశాంతంగా, నిబ్బరంగా, అందంగా, చందంగా—చక్కగా కూర్చున్న చందన—

అవునమ్మా మహారాణీ—మా పనమ్మాయి రాలేదు—"తెలుస్తూనే వుందిలే—ఆ వంకర టింకర చీర కుచ్చెళ్ళు—పాపిట్లో వంకర్లు—లేటు పర్మిషన్లు—టిఫిన్ డబ్బా తేకపోవడం—ఇదేగా పది రోజుల కోసారి నీ వాలకం"

"అవును—అసలు ఈ జన్మలో ఎప్పుడైనా లేటుగా వస్తావా నువ్వు? ఏమిటి నీ విజయ రహస్యం? ఏ చీకూ చింతా లేకుండా ఎంత నిబ్బరంగా హాయిగా వుంటావు? ఆ చిట్కా ఏదో నాకు చెప్పకూడదూ?" అడగాలనుకుంటుంది గానీ అడగలేదు—ఇవ్వాళ అడగాలి.

"పద—పద—ఇవ్వాళ నా డబ్బాలో గుత్తి వంకాయ కూర తెచ్చాను" అని లంచ్ బ్రేక్‌లో ఆహ్వానించింది చందన—

"నీకూ నీ మొగుడూ—ఇద్దరు పిల్లలూ—వాళ్ళకి స్కూళ్ళూ—ఓ పని మనిషీ వున్నారు గదా—నువ్వెప్పుడూ ఇంత హాయిగా ఎలా వుంటావే చందనా—మీ ఇంట్లో అస్తమానూ వుండే మంచి పనిమనిషి వుండి వుంటుంది—అవునా?" అంది వందన.

చందన పకపకా నవ్వింది—



"ఎందుకలా అనుకున్నావు?" అంది—

" నువ్వు చెరగని ముస్తాబుతో చక్కగా రోజూ టైం తప్పకుండా ఆఫీసుకి రావడం వెనుక రహస్యం ఆ పనిమనిషే అని నా ఉద్దేశ్యం"

చందన మనోహరంగా నవ్వి—"నీకో రహస్యం చెప్పనా?"

" అసలు మాకు పనిమనిషే లేదు—" అంది.

"మరి? పనంతా నువ్వే చేస్తావా? గిన్నెలు కడగడం, బట్టలు ఉతకడం..."

"అందరం చేసుకుంటాం—ఈ పనిమనిషుల కోసం ఎదురు చూడ్డం—వాళ్ళు రాకపోతే విసుక్కోడం ఇంట్లో అందరూ బద్ధకస్తుల్లా తయారవడం—పనంతా ఒక్క ఆడదాని మీదే పడడం ఇదంతా మాకు నచ్చదు" వందన తల తిరిగి పోయింది.

"ఇప్పుడు ఇంటికి వెళ్ళాక పిల్లల టిఫిన్ బాక్సులు కడగడం వాళ్ళ హోం వర్కు ఇదంతా"

"హోం వర్కు మా రఘు చేయిస్తాడు—టిఫిన్ బాక్స్ ఎవరిది వాళ్ళే కడిగేస్తారు—ఈ పూట వంట కూడా ప్రొద్దున్నే అయిపోతుంది నాకు—పిల్లల యూనిఫామ్స్ వారానికోసారి ఉతుక్కుంటాం"

"ఉతుక్కుంటాం అంటే మీ ఆయన కూడానా?"

"ఏం ఆయన బట్టలు వేసుకోడా? మా రఘుకి అదంతా ఏం లేదు—అవునూ—అమెరికాలో వున్న మీ తమ్ముడు తన వంట తను చేసుకుని తన బట్టలు తను ఉతుక్కుని, తన గిన్నెలు తను కడుక్కుంటాడని చెప్పావు కదా? మరి ఇక్కడ చేసుకుంటే తప్పేం?"

వందనకి మళ్ళీ సానుభూతి పొంగింది—ప్రపంచంలో అందరి మొగుళ్ళూ, అందరి పిల్లలూ మంచి వాళ్ళే—వందన బ్రతుకే ఇలా తగలడింది.



ఫోటో: ఎస్.బి. పార్వతి, వెల్లటూరు

"అమెరికాలో అన్నింటికీ మిషన్లున్నాయి—మనకేవీ?" అంది వందన తనని తనే ఓదార్చుకుంటూ.

"లేకేం? మనకీ వచ్చాయిగా రకరకాల మిషన్లు—ఇద్దరం సంపాదించుకుంటున్నప్పుడు ఒక్కొక్కటీ కొనుక్కుని జీవితాన్ని కాస్త సుఖంగా దిద్దు కోవచ్చు" వందన మనస్సు "అదోలా" అయిపోయింది (వందనకి పల్ప్ సాహిత్యం చాలా యిష్టం)

అదన్నమాట సంగతి! మొగుడు ఇంట్లో పన్లన్నీ చేస్తుంటే ఈ మహారాణి దర్జాగా ఆఫీసుకి వస్తుంది. ముక్కు పచ్చలారని పిల్లల చేత టిఫిన్ బాక్సులు కడిగిస్తుంది. ఇలాంటి వాళ్ళకే మంచి రోజులు—ప్రశంసలు కూడా. తనలాంటి మంచి వాళ్ళకి ఇంటా బయటా కూడా చివాట్లే! వందన మనస్సు భారం అయిపోయింది. చందనకి ఓ మంచి పనిమనిషి వుందని తెలిసినా ఇంత బాధ కలిగేది కాదు—ఆమెకి పనిలో పిల్లలు భర్త సాయం చేస్తారంటే—ఆ మాట తనకి ఏమాత్రం సంతోషం కలిగించడం లేదు. పైగా చాలా కష్టంగా వుంది—ఇలా కష్టంగా బాధగా వుండడాన్ని అసూయ అంటారేమో మరి—ఆ సంగతి వందనకి తట్టలేదు.


సాయంత్రం మళ్ళీ వరాలు రాలేదు—పిల్లలు టిఫిన్ బాక్సులు, మంచినీళ్ళ సీసాలు తెచ్చి సింక్‌లో పడేశారు. బూట్లు విప్పి ఇంటినిండా ఇసుక పోశారు—స్కూల్ సంచీలు కుర్చీలో గిరాటేసి, అలసిపోయి తినడానికి పెట్టమని మారాం చేశారు—పిల్ల మోడల్స్ కావాలంటే పిల్లవాడు ఇంకేదో కావాలన్నాడు—వాణ్ణి బ్రతిమిలాడి బజారుకి పంపి బిస్కట్లు తెప్పించి పబ్బం గడిపేసరికి కళ్ళంట నీళ్ళొచ్చాయి—

ఆడవాళ్ళయితే ఆఫీసు నించీ సరాసరి ఇంటికి వస్తారు—మగవాళ్ళు మాత్రం ఎంత సేపటికోగాని ఇల్లు చేరరు—అమ్మ పనే హాయిగా వుండేది—ఆవిడకి చదువూ లేదు ఉద్యోగమూ లేదు—బజారు పనులన్నీ నాన్నే చేసేవారు. ఆవిడ ఒక్క చీటీ వ్రాసి నాన్న దగ్గరికి పంపితే చాలు, సామాన్లన్నీ దిగిపోయేవి. ఆఖరికి ఆవిడ కట్టే చీరెలు కూడా ఆయనే తెచ్చేవారు—వెధవ ఆర్థిక స్వాతంత్ర్యం వుంటే ఎంత? లేకపోతే ఎంత! డబ్బు సంపాదించి తను మాత్రం ఏం సుఖపడుతోందటా!

"ఏమిటే! ఇంటి నిండా ఇసుక—కుర్చీలో పుస్తకాలూనూ! కాస్త ఇల్లుచిమ్మితే పోదా!" పతిదేవుని సంధ్యా వందనం.

వందన చీపురు తెచ్చి ఇల్లు వూడ్చింది. బాక్సులు కడిగింది. పిల్లల హోం వర్కు చూసింది—రాత్రికి వంట చేసింది—మర్నాటికి పెరుగు తోడు పెట్టింది—ఇంకా చాలా చాలా చిల్లర పనులు చేసింది— ఆపైన పెల్లుబికిన సానుభూతి వెల్లువలో కొట్టుకు పోయింది.

"ఎప్పుడూ ఏడుపే—మంచి పనమ్మాయిని పెట్టుకుని సుఖపడ్డం రాదు—ఎదురింటి సుశీల చూడు చక్కగా ఎలా వుంటుందో—ఆవిడ చెయ్యడం లేదా ఉద్యోగం—మానెయ్ లేకపోతే—నీ ఉద్యోగం డబ్బు నీ చీరెలకీ, పర్సులకీ, చెప్పులకీ—బస్సు ఖర్చులకీ సరిపోతుంది—ఉద్యోగం మానేస్తే



అవన్నీ వుండవుగా—'' పతి దేవుని పవళింపు సేవ! పగలంతా కార్యేషు దాసి, ఇప్పుడేమో శయనేషు రంభ కాబోలు! రంభట రంభ! నడుమూ కాళ్ళూ ఒకటే పీకుతున్నాయి—కడుపులో లేని ప్రేమ కావలించుకుంటే వస్తుందా అనీ—ఛీ—ఛీ—అవును సార్—నాకెప్పుడూ ఏడుపే—ఈ బ్రతుక్కి సుఖం లేదు—నా బోటి స్త్రీలకి ఆర్థిక స్వాతంత్ర్యం ఏమాత్రం సుఖం ప్రసాదించలేదు—మాది బానిస బ్రతుకైపోయింది—మళ్ళీ వందన మనసంతా 'అదోలా' అయిపోయింది—తెల్లవారవచ్చె తెలియక నా తల్లీ మళ్ళీ పరుండేవు లేవమ్మా—వరాలు కూడా రాలేదమ్మా—ఇవ్వాళ ఆఫీసుకి సెలవ్—సిక్ లీవ్—వాంతులు—విరేచనాలవలన ఆఫీసుకి రాలేక పోతున్నందుకు దయచేసి ఈ రోజు సెలవు మంజూరు చేయ వలసిందిగా ప్రార్థిస్తున్నాను—యువర్స్ సిన్సియర్లీ, వందన—వున్నాయిలే ఈ సంవత్సరానికింకా రెండు మూడు క్యాజువల్ లీవులు—ఓ పిక్నిక్లా? వినోద యాత్రలా? విందులా? వినోదాలా? అన్నీ ఇలాంటి సెలవులే—చుట్టాలొచ్చారనీ—పిల్లలకి జ్వరాలనీ—పని మనిషి రాలేదనీ—

''ఇవ్వాళ సెలవు పెట్టినట్లున్నావుగా—మొన్న కుట్టించుకున్న క్రొత్త షర్టులు కొంచెం వుతికి పెడుదూ'' బ్రేక్ ఫాస్టు చేస్తూ గొంతులో కాస్త మార్దవం నింపుకుని పతిదేవుడు—

''రేపు మా స్కూల్లో ఎలక్యూషన్కి నాకు కొంచెం పాయింట్లు తయారు చేద్దూ!'' కూతురు

''మమ్మీ! సాయంత్రం టిఫిన్ దోశలు'' కొడుకు ఆజ్ఞ—అవును బాబూ! నేనెందుకు సెలవు పెట్టాను! వరాలు రాలేదని—ఇవ్వన్నీ చెయ్యడానికా!


సాయంత్రం చందన ఆఫీసు నుంచి ఇంటికి వెడుతూ చూసి పోదామని వచ్చింది—వాకిట్లో మోపెడ్ ఆగడం చూసి పిండి చేతులు కడుక్కుని బయటికి వచ్చింది వందన—

''నీకెలా వుందో చూసి పోదామనీ—నిజంగా వాంతులేనా?'' అంది—

''వరాలు ఇవ్వాళ కూడా రాలేదు''

''అవునూ—వంట్లో బాగాలేకపోతే—హాయిగా మీ అందరూ ఈ పూటకి బయటికి వెళ్ళి భోజనం చెయ్యొచ్చుగదా—సెలవు పెట్టి మరీ పని చెయ్యాలటా! నేనయితే చెయ్యను బాబూ''

చందనకీ తనకీ ఒకే జీతం—వాళ్ళాయనకి తన



ఓ హోటల్కు వెళ్ళి ఓ సప్లయర్ను అడిగాడు ఓ వ్యక్తి.

''ఏమోయ్! దీపావళి స్పెషలేమిటి?''

''ఢాం... ఢీ... తుస్... చుస్... జుస్... కీర్... ఢూర్ సార్!'' చెప్పాడు ఆ సప్లయర్.

—టి.వి.యస్. బాబు

మొగుడికన్న ఓ వంద తక్కువే గాని ఎక్కువ రాదు— చందన ఇంత దర్జాగా ఎలా వుండబ్బా! మొగుడికీ పిల్లలకీ సరిగ్గా తిండి పెట్టదేమో—దీనికి వంట చెయ్యడానికి కూడా బద్ధకమే—చందన బ్యాగ్లో నుంచి రెండు యాపిల్ పళ్ళు తీసి వందన కిచ్చి ''దారికదా అని మార్కెట్కి వెళ్ళి కూరలు తెస్తున్నాను'' అంది—

''ఏమో తల్లీ—నీ మహాత్యాలు నీకే అర్థం అవుతాయి'' అనుకుంది వందన—చందన మోపెడ్ ఎక్కి వేగంగా వెళ్ళిపోయింది.

వచ్చింది వరాలు—మూడు రోజుల తరువాత—వందనకి జ్వరం వచ్చిన తరువాత—ఆమె వొళ్ళు పచ్చి పుండులా అయిపోయిన తరువాత. తను పిల్లల్ని తిట్టి అతనితో తగూలాడి గట్టిగా ఏడ్చేసిన తరువాత! మూడు రోజులుగా ఎందుకు రాలేదు? జ్వరంగానీ జబ్బుగానీ చేసిన దాన్లా లేదు—చక్కగా వుంది—వస్తూనే చీపురు తీసుకుని నంగనాచిలా వాకిలి ఊడవడానికి వెళ్ళింది.

''ఫలానా కారణాన రాలేదమ్మగారూ'' అని చెప్పకుండా—''అయ్యో పాపం ఎలా వున్నారో ఏమో!'' అనైనా అనకుండా దర్జాగా వెళ్ళింది వాకిట్లోకి—

ఈరోజుల్లో పనివాళ్ళ బ్రతుకులే బావున్నాయి—వాళ్ళకి ఏం పన్లుంటాయి ఇంట్లో—వందన కాఫీ త్రాగుతూ వరాల్ని క్రీగంటితో చూసింది—పిడుగులు పడ్డా చలించని దానిలా ఇల్లు చిమ్ముకుంటోంది వరాలు—ఎంత ధైర్యం! నిక్షేపంలాంటి అమెరికన్ సిల్కు చీరె తీసుకుని నెల రోజులు కాలేదు—పాట్టయిపోయాయని అరడజను నిక్కర్లు వాళ్ళబ్బాయికిచ్చి పదిహేను రోజులు కాలేదు—విశ్వాస ఘాతకురాలు—దాన్ని తీసెయ్యాలి పనిలోంచి—

''ఏమండీ వరాలు గారూ—మూడు రోజులాయె ఏ వూరు వెళ్ళారు—'' అంది కసిగా వందన.


''ఇక్కడే వున్నానమ్మా—ఏడికీ పోలేదు'' అంది—

''అయ్యో అమ్మగారూ—నన్ను మీరంటారేంటండి—తప్పు కదూ—ఏదో పొరపాటయిందని నన్ను అలా బాధపెట్టకండి—'' అంటుందనుకుంది వందన.

''మరి ఇక్కడే వుండి రాలేదేం'' అంది గొంతు మార్చి—

''ఈలు కాలేదమ్మా—ఈలయితే రాకపోదునా?'' అంది ఎందుకు వీలు కాలేదో చెప్పకుండా.

''ఇలా చెప్పా పెట్టకుండా మానేస్తే మాకు ఉద్యోగాలు పీకేస్తారు—మీకేం దర్జాగా ఎన్నిరోజులైనా మానేస్తారు—ఓ మాటంటే పెనుక్కుని పెనుక్కుని బాధపడతాం—మీకేం—వేషమా రోషమా ఎన్నన్నా ఒక్కటే—మీరు లేనిదే మాకు జరగదని మీకు గర్వం—నీమూలంగా నేను సెలవు పెట్టాల్సొచ్చింది''



వరాలు మాట్లాడలేదు—చీపురు గోడకి తగిల్చి—అంట్లు ముందు కూర్చుంది.

వందన వాక్ప్రవాహం వరాలుని కదల్చలేదు—యంత్రంలా అంట్లు తోమి పెట్టేంది—బట్టలు వుతికి ఆరేసింది.

వరాలొచ్చి వందుకు వందనకి చాలా హాయిగా వుంది—చెమట పట్టిన శరీరం మీద పన్నీరు కలిపిన గోరు వెచ్చని నీళ్ళ స్నానం చేసినట్లుంది. ఆరు బయట వెన్నెల్లో కూర్చున్నట్లుంది—దాహం వేస్తూండగా ద్రాక్ష రసం తాగినట్లుంది—అమ్మ దగ్గర్నుంచి ఉత్తరం వచ్చినట్టుంది—వరాలు పని మానెయ్యలేదని చాలా రిలీఫ్‌గా వుంది—కానీ వరాల్ని బాధపెట్టాలని వుంది. ఇన్నాళ్ళు రానందుకు ఏమీ అనకపోతే తను అలుసై పోతాననిపించింది—సంజాయిషీ యివ్వని ఆ మనిషి వలన తనకెంత ఉపయోగం వున్నా—సంజాయిషీ ఇచ్చే సంతృప్తి ఎక్కడిది? ఇంగ్లీషులో దాన్ని ఇగో సాటిస్‌ఫాక్షన్ అంటారేమో!

"అలా వున్నారేం అమ్మగారూ" అంది వరాలు వెడుతూ—అమ్మగార్ని చూసి చాలా జాలి పడుతున్నట్టు.వందనకి వళ్ళు మండిపోయింది. ఇందాకటినించీ తను అన్న మాటలన్ని వినీ వినీ, ఇప్పుడు నంగనాచిలా "అలా వున్నారేం" అంటోంది—

"ఎలా వున్నానేం? నువ్వెన్నాళ్ళు రాకపోయినా నీకు నాగాలు కట్టకుండా జీతం యిచ్చి, చీరెలిచ్చి, మీ పిల్లలకి బట్టలిచ్చి—నేను ఆఫీసుకి సెలవు పెట్టి నడుం విరుచుకున్నందుకు సంతోషంగా వున్నాను—సరేనా? నా మనసంతా ఆనందంతో నిండిపోయింది" అంది తనకు చేతనైనంత వ్యంగ్యంగా.

ఈసారి వరాలు ఓ చిన్న నవ్వు నవ్వి గడప దాట బోయింది—

"అవునే వరాలూ—నీకు నవ్వుగానే వుంటుంది—నీకు రోషం లేదు—వేషం లేదు—ఎన్నన్నా పట్టించుకోవు—మాలాగ ఓ చిన్న మాటంటే రోషపడి ఏడవవు—అదృష్టవంతురాలివి" అంది వందన—వరాలు అప్పటికీ మాట్లాడలేదు.

"చదువుకున్న వాళ్ళకే అన్ని బంధాలు—నీకేం మీ ఆయన కొట్టినా రెండు రోజుల్లో దెబ్బలు మానిపోతాయి—మళ్ళీ ఇద్దరూ నవ్వుకుంటూ సినిమాకి పోతారు—మాకలా కాదు—నీ కర్థం కాదులే—ఏమిటో ఈ మూడు రోజుల నుంచీ మనస్సంతా చికాకైపోయింది—నీమూలంగా అబద్ధం ఆడి సెలవు కూడా పెట్టాను ఆఫీసుకి—నీకేం నువ్వు పని మానేసినా ఎందుకు మానేశావో చెప్పనక్కర్లేకుండానే దర్జాగా చీపురు తీసుకుని దొడ్లోకి వెళ్ళిపోయావు—మాకు పది మందికి సంజాయిషీ ఇవ్వాలి—"

ఈసారి వరాలు వెనక్కి తిరిగి వందన వైపు చూసి మళ్ళీ నవ్వింది—ఆ నవ్వుని చిత్రించడం లెనార్డో డావిన్సీకి కూడా చేతకాదు—అలాంటి అద్భుతమైన నవ్వు.

"అవునండమ్మగారూ—మీకన్న నేను సాలా అదృష్టవంతురాలిని—వేలకి వేలు జీతం తెచ్చుకొని పిల్లల్ని మంచి మంచి బళ్ళల్లో సదివించుకుంటూ—కంటికి నచ్చిన చీర కట్టుక్కొని యిష్టమైన తిండి తిని, వాన కాలంలో ఎచ్చగా, ఎండాకాలంలో సల్లగా వుండే ఇంట్లో కాపురం వుండి—మూడు నిమిషాల్లో గాస్ మీన వంట జేసుకోనే మీరు—దురదుష్ట వంతులు—కట్టెలుంటే బియ్యం వుండవ్—బియ్యం వుంటే కట్టెలుండవ్—చీరుంటే రయికుండదు—రయికుంటే చీరుండదు—పిల్ల గాండ్లకు బడికి సంపాలంటే పది రూపాయిలు లేవు—నేను అదురుష్టవంతురాలిని—మా ఆయన కొట్టిన దెబ్బలు రెండు రోజులకిమానిపోతాయా? ఎవరు సెప్పారమ్మగారూ ఆ మాట. మీకు మనసులున్నాయేమో! మాకు అవేటో తెలీదండమ్మా—మాకుండేవల్లా శరీరాలే. ఆటితోనే పని సేస్తాం—మీ యింట్లో తోమేవి—మీ బట్టలుతికేవి కూడా ఆ శరీరాలేకదమ్మా! ఆటితోనే నాలుగు రూపాయిలు సపాయించుకోవాలా—ఆటికే దెబ్బలు పడతాయి—అందుకే నాగాలెడతాం—మీ లాంటి సదూకున్న వారంతా సారా దుకాణాలు మూసేయించలేకపోనారా! ఊరూరా గవుర్మెంటే దుకాణాలెట్టేసి "తాగండొరే ఎదవల్లారా?" అని అమ్మిస్తా వుండారు—మా మగాళ్ళు సంపాదించిందంతా తాగేస్తే—మేం పదిళ్ళు పాచి పని చేసి ఇల్లు గడుపుకొస్తున్నాం—మీలాగ మాకు సమత్సరానికిన్ని సెలవలున్నాయా? జీతాలు పెంచుతున్నారా? బోనాసులిస్తున్నారా? అయి పెంచకపోతే మేం సమ్మెలు సేస్తున్నామా? అవునమ్మా—మాకు మనసుల్లేవు—శరీరాలే వుండాయి—అయి శుభ్రంగా తోముకోడానికి ఓ సబ్బు ముక్క లేదు—కప్పుకోడానికి బట్ట లేదు—ఎండకీ వానకీ ఆగే కొంప లేదు—అలాంటోళ్ళకి రోషాలేంటమ్మా—మనసుల మాట వున్న వాళ్ళకి కానీ మాక్కాదు తల్లీ—మూడ్రోజుల సంది ఎందుకు రాలేదని అక్కసు పడుతున్నావు—చెబుతా విను—ఇదిగో ఈ వీప్మీద దెబ్బలున్నాయి చూశావా? అవి మా ఆయనా, ఆయన అక్కా కలిసి కొట్టినవి—నువ్వు చెప్పినట్టు రెండ్రోజుల్లో మానవమ్మా—సలపరింతలు పెడతాయి—జొరం వస్తది—ఎముకలు యిరిగిపోతాయి—అన్నీ వొదిలిపోతే ఇంకోడు ఎంట పడతాడు—ఆడూ ఇంతే—పిల్లల తండ్రి కదా—పిల్ల సన్నాసుల గురించి ఇదంతా—ఈ సోదికేం లేగానమ్మా—నేనెల్తున్నా—ఈ దెబ్బలు తప్పనంత కాలం ఈ నాగాలు ఇంతేనమ్మా—వద్దంటే ఇంకో ఇల్లెతుక్కుంటా!"

తన శరీరం కుంచించుకుని కుంచించుకుని తను మరుగుజ్జులా—చివరికి చీమలా అయిపోయినట్లనిపించింది వందనకి—ప్రవాహంలో కొట్టుకుపోతున్న చీమ మిత్రుడికి ఓ ఆకు విసిరి వొడ్డుకి తెచ్చిన కాకి నేస్తం కథ ఎప్పుడో చదివిన గుర్తొచ్చింది.

